క్లుప్తంగా

కాళికాంబదేవికి ప్రత్యేక పూజలు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని గాంధీ చౌక్‌లో వెలసిన కాళికాంబ చంద్రశేఖరస్వామి దేవస్థానంలో భాద్రపద మాసం పురస్కరించుకుని శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా అమ్మవారి మూలవిరాట్‌కు ఉదయం సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం వివిధ రకాల పూలచే అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అమ్మవారికి ఒడి బియ్యం పోసి మహామంగళ హారతులు ఇచ్చారు. రాహుః కాల పూజలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పల్లకీలో ఆశీనులను చేసి ఆలయ ప్రాకారంలో ప్రదక్షిణలు చేపట్టారు. చివరగా నవవిధ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఈఓ లక్ష్మీనారాయణ, అర్చకులు సుబ్బాచారి, రాఘవేంద్రాచారి, సుబ్రమణ్యం శాస్త్రీ, తిమ్మయ్య పాల్గొన్నారు.

భూసమస్యలకు పరిష్కారం



గుండుపాపల పొలాల్లో పాతిన రాయి

దొర్నిపాడు: ఏళ్లనాటి భూ సమస్యలకు ప్రభుత్వం జగనన్న శాశ్వత భూహక్కు- భూరక్ష పథకం ద్వారా చక్కటి పరిష్కారం లభించింది. ఇటీవలో మండలంలోని కొండాపురం, గుండుపాపల గ్రామాల్లో 949 మంది రైతులకు భూహక్కు పత్రాలను అందజేశారు. ప్రతి సర్వే నంబర్‌కు ఎఫ్ఎంబీలను రూపొందించి వైఎస్సార్ జగన్న భూరక్ష-2020 పేరుతో ముద్రించిన రాళ్లను పొలాల గట్ల వెంట పాతారు. రెండు గ్రామాల్లో సుమారు 2,156 రాళ్లను ఏర్పాటు చేసినట్లు అధికారులు చెబుతున్నారు. పొలాల సమస్యలు లేకుండా చక్కటి మార్గం చూపారని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలి

నంద్యాల(న్యూటౌన్): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలని, రాయలసీమకు ప్రత్యేక ప్యాకేజీ, కడప ఉక్కు పరిశ్రమకు జాతీయ హోదాతోపాటు పోలవారినికి నిధులు కేటాయించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగ నాయుడు, సహాయ కార్యదర్శి బాబాఫకృద్దీన్ కేంద్రప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ విభజన హామీలను అమలు చేయని పక్షంలో బీజేపీకి రాష్ట్ర ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. సమావేశంలో సీపీఐ నాయకులు సుబ్బరాయుడు, శ్రీనివాసులు, ప్రసాద్, ధనుంజయుడు, తదితరులు పాల్గొన్నారు.

నేడు పెద్దకంబలూరులో సురక్ష వైద్య శిబిరం

రుద్రవరం: మండల పరిధిలోని పెద్దకంబలూరులో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహిస్తామని రుద్రవరం పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రసాద్ తెలిపారు. స్థానిక పీహెచ్‌సీలో గురువారం ఆయన మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష గ్రామీణ ప్రాంత ప్రజలకు వరమన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు జిల్లాస్థాయి ఎంపిక పోటీలు

నంద్యాల(న్యూటౌన్):పట్టణంలోని కేఎస్ఎం మున్సిపల్ హైస్కూల్ క్రీడా మైదానంలో శనివారం జిల్లాస్థాయి త్రోబాల్, టేబుల్ టెన్నిస్, బాక్సింగ్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ సెక్రటరీలు లక్ష్మయ్య,శివకుమార్ తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడుతూ అండర్-17, 14 విభాగాల్లో బాలురు,బాలికలు పాల్గొనాలన్నారు.

పశువుల కాపరులకు అవగాహన


పశువుల కాపరులకు అవగాహన కల్పిస్తున్న జయరాములు

నంద్యాల(వ్యవసాయం): ఆర్‌పీఎఫ్ ఏఎస్ఐ జయరాములు స్థానిక నూనెపల్లె రైల్వే గేటు వద్ద పశువుల కాపరులకు, స్థానికులకు అవగాహన కల్పించారు. రైలు మార్గంపై రాళ్లు విసరడం ,పట్టాలకు అడ్డంగా దాటడం, రైలు ప్రయాణంలో అలరం చైన్ లాగటం, తదితర విషయాలపై అవగాహన కల్పించారు. పట్టాల వద్ద ఆవులు, గేదెలు సంచరించకుండా చూడాలని సూచించారు.

నిందితుడికి జైలుశిక్ష

నంద్యాల(వ్యవసాయం): మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన ఓ నిందితుడికి శుక్రవారం సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ రామిరెడ్డిగారి రాంభూపాల్‌రెడ్డి జైలు శిక్షను విధించినట్లు పోలీసు సిబ్బంది తెలిపారు. సాయిబాబానగర్‌కు చెందిన షేక్ రఫీ ప్రభుత్వ ఆసుపత్రి వద్ద మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తుండటంతో స్థానికుల ఫిర్యాదు మేరకు టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. నిందితుడి ని అరెస్ట్ చేసి జడ్జి ఎదుట హాజరు పరచగా 8 రోజులు జైలుశిక్ష ఖరారు చేసినట్లు పోలీసులు తెలిపారు.


ఓపీ నమోదు చేసుకుంటున్న గ్రామస్తులు


గర్భిణిని పరీక్షిస్తున్న స్పెషలిస్టు డాక్టర్


శెట్టివీడులో ప్రజలకు మందులు పంపిణీ చేస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది


యాళ్లూరులో వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యం

- అయ్యలూరు జగనన్న ఆరోగ్య సురక్షలో పాల్గొన్న ఎమ్మెల్యే శిల్పా రవి


దివ్యాంగుడు హుసేన్‌బాషాకు పెన్షన్ మంజూరు చేయాలంటూ డీఎంహెచ్‌ఓకు సూచిస్తున్న ఎమ్మెల్యే

నంద్యాల(అర్బన్): ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవి చంద్రకిశోర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని అయ్యలూరు సచివాలయం-2 పరిధిలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే శిల్పా రవి పాల్గొన్నారు. వివిధ కౌంటర్లను, కేషీట్‌లను పరిశీలించారు. ప్రజల ఆరోగ్య సమస్యలు గుర్తించి సంబంధిత ఆసుపత్రికి పంపేలా స్పెషలిస్టు వైద్యులను ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే శిల్పా రవి మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆరోగ్యశ్రీ పథకాన్ని తెచ్చి పేదల జీవితాల్లో వెలుగులు తెచ్చారన్నారు. తండ్రికి తగ్గ తనయుడిగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరో అడుగు ముందుకు వేసి ఆరోగ్యశ్రీని పటిష్టం చేయడమే గాకుండా 3256 వ్యాధులకు వైద్యసేవలు అందేలా చర్యలు తీసుకున్నారన్నారు. పేదల ఆరోగ్యానికి భరోసా కల్పిస్తూ ఇంటి వద్దకు వెళ్లి వైద్య సేవలు నిర్వహించి జగనన్న ఆరోగ్య సురక్ష ప్రత్యేక శిబిరాల ద్వారా పేదలకు వైద్య సేవలు అందిస్తున్నారన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో ఏడు రకాల వైద్య సేవలతో పాటు 110 రకాల మందులను అందజేస్తున్నట్లు చెప్పారు. సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆయన వెంట మార్కెట్ యార్డు చైర్మన్ మహేశ్వర రెడ్డి, మాజీ చైర్మన్ పురుషోత్తమరెడ్డి, వైఎస్సార్‌సీపీ డాక్టర్ల విభాగం జిల్లా కార్యదర్శి మహమ్మద్‌రఫీ, అష్రఫ్‌అలీ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ పీడీ నిర్మల, సీడీపీఓ చంద్రకళ, సూపర్‌వైజర్ విజయ, గ్రామ నాయకులు రవికుమార్, ఎంపీటీసీ అబ్దుల్‌రషీద్, వైస్ ఎంపీపీ పుష్పలత, మాజీ సర్పంచ్ ఎల్లయ్య, వైస్ సర్పంచ్ శివలలిత, ఎల్ల సుబ్బయ్య, ఎంపీడీఓ సుగుణశ్రీ, పంచాయతీ కార్యదర్శి అక్బర్‌వలి పాల్గొన్నారు.

ప్రజలకు రక్షగా ఆరోగ్య సురక్ష

గోస్పాడు: జగనన్న ఆరోగ్య సురక్షతో పేదకు ఆరోగ్య రక్షగా మారిందని నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్, డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి అన్నారు. మండలంలోని యాళ్లూరు సచివాలయం 1 పరిధిలో శుక్రవారం జగన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. శిబిరంలో డాక్టర్లు భార్గవి, గోపాల్, శివాని, మనోహర్‌లు ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలనే లక్ష్యంతో గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వైద్య శిబిరంలో స్పెషలిస్ట్ డాక్టర్లు ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రత్నమ్మ ఉప సర్పంచ్ బెక్కెం నాగేశ్వర రెడ్డి, ఎంపీటీసీలు భారతి, కళ్యాణి, కోఆప్షన్ మెంబర్ గోకారి, ఎంపీడీఓ భాస్కర్, పంచాయితీ కార్యదర్శి సుబ్బారావు, సచివాలయ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్ష వైద్య శిబిరానికి విశేష స్పందన

ఆళ్లగడ్డ: మండల పరిధిలోని నల్లగట్ల గ్రామంలో శుక్రవారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరానికి అనూహ్య స్పందన వచ్చింది. ప్రజలు భారీగా తరలి వచ్చి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. దీర్ఘకాలిక రోగాలతో బాధపడుతున్న పలువురికి నెలకు సరిపడా మందులు అందజేశారు. మెరుగైన వైద్యం అవసరమైన వారిని గుర్తించి పెద్దాసుపత్రికి రెఫర్ చేశారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు

శెట్టివీడు గ్రామంలో..

చాగలమర్రి: మండలంలోని శెట్టివీడు ప్రాథమిక పాఠశాల ఆవరణంలో శుక్రవారం ఎంపీడీఓ మహబూబ్‌దౌలా, డాక్టర్ ఇమ్రాన్ ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. కదిరిపురం, కదిరిపురం తండా, జ్ఞానాపురం గ్రామాల నుంచి తరలివచ్చిన ప్రజలకు ప్రత్యేక వైద్య నిపుణులు శబరి, ఎండీ జనరల్, డాక్టర్ రాజ్యలక్ష్మి, ఎనస్తీషియా డాక్టర్ సుల్తానా, ఫిజిషియన్ వైద్య సేవలు అందించారని డాక్టర్ ఇమ్రాన్ తెలిపారు. మెరుగైన వైద్యం అవసరమైన గుర్తించి నంద్యాల, కర్నూలులోని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రులకు రెఫర్ చేశామన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుశీలమ్మ ఆధ్వర్యంలో సమీకృత పౌష్టికాహార పదార్థాల స్టాల్‌ను ఎర్పాటు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుభద్రమ్మ, జేసీఎస్ జిల్లా అధ్యక్షుడు షేక్.బాబులాల్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు జి.కుమార్‌రెడ్డి, ఎంపీపీ వీరభద్రుడు, ఎంపీటీసీ రజేశ్వరీ, సర్పంచులు లక్ష్మీదేవి, శ్రీలక్ష్మీబాయి, పంచాయితీ కార్యదర్శి స్వప్న తదితరులు పాల్గొన్నారు.

బీమాను సద్వినియోగం చేసుకోండి


మాట్లాడుతున్న పార్టీ మండల అధ్యక్షుడు ప్రతాపరెడ్డి


హాజరైన కన్వీనర్లు, గృహ సారథులు

శిరివెళ్ల: పార్టీ అమలు చేస్తున్న జీవిత బీమాను సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఇందూరి ప్రతాపరెడ్డి సూచించారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్టీ యాప్‌లో ఆధార్ నంబర్లు నమోదు చేసుకోవాలన్నారు. త్వరలో గుర్తింపు కార్డులు, హెల్త్ కార్డులు జారీ అవుతాయన్నారు. పార్టీ విజయానికి త్వరలో పల్లెకు పోదాం కార్యక్రమం మొదలవుతుందన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బి.బుల్ సలాం, జెడ్పీ వైస్ చైర్మన్ దిల్షాద్‌బేగం, ఎంపీపీ నాయక్ వసీం, స్టేట్ అకాడమీ డైరెక్టర్ హఫీజ్, సర్పంచులు మందాల శివారెడ్డి, జింకల నాగన్న పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతు పక్షపాతి

- ఎమ్మెల్యే శిల్పా రవి రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్ బాషా


రైతులకు శనగ విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శిల్పారవి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా

నంద్యాల: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతన్నల పక్షపాతి అని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఇస్సాక్ బాషా అన్నారు. ఎమ్మెల్యే స్వగృహంలో శుక్రవారం రైతన్నలకు సబ్సిడీ శనగ విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ మాట్లాడుతూ రబీ సీజన్‌లో పంటల సాగు చేసేందుకు 40 శాతం సబ్సిడీపై శనగ విత్తనాలు అందిస్తున్నామన్నారు. గత ఏడాది 25 శాతం సబ్సిడీతో విత్తనాలు అందజేశామని, ఈ ఏడాది ప్రభుత్వం మరో 15 శాతం సబ్సిడీని పెంచిందన్నారు. మిర్చి రైతులు గుంటూరుకు వెళ్లాల్సిన అవసరం లేకుండా సీఎం జగన్‌మోహన్ రెడ్డి మిర్చి యార్డును నంద్యాలలో ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. రైతుల కోసం మరో ముందడుగు వేస్తూ మిల్లెట్స్ సెకండరీ యూనిట్ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారన్నారు. నంద్యాల మండలం రాయమాల్పురంలో మిల్లెట్స్ సెకండరీ ప్లాంట్ ఏర్పాటుకు తాజాగా భూమి పూజ చేశామన్నారు. ప్రజలు చిరు ధాన్యాల ఉత్పత్తులను ఆహారంగా తీసుకుంటే లభించే ఉపయోగాలు తెలుసుకోవాలని కోరారు. హార్టికల్చర్ రైతన్నలకు వ్యవసాయ ఉత్పత్తులను నిలువ చేసుకునేందుకు తొమ్మిది గోడౌన్లను నిర్మించేందుకు పనులను చేపట్టామని, వాటిని త్వరలో పూర్తి చేసి రైతన్నలకు అంకితం చేస్తామన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ మహేశ్వరరెడ్డి ఎంపీపీ శెట్టి ప్రభాకర్, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్, పురుషోత్తం రెడ్డి, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

పేదలందరికీ ఇళ్ల పట్టాలు అందించడమే లక్ష్యం

నంద్యాల పట్టణంలో ప్రతి నిరుపేదకు ఇంటి పట్టా ఇవ్వడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానికి జగనన్న లేఅవుట్‌ను అధికారులు, నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం లే అవుట్‌ను పూర్తిగా అభివృద్ధి చేసి, రోడ్లు, డ్రైన్లు, తాగు నీటి సౌకర్యాలతో పాటు ప్రాథమిక మౌలిక సదుపాయాలను కల్పించి ఇస్తామన్నారు. ఇదంతా రాజకీయం కోసం కాకుండా నంద్యాలలో ప్రతి ఒక్కరికీ స్వంత గృహం ఉండాలనే లక్ష్యాన్ని సీఎం జగనన్న, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సంకల్పించిందన్నారు. కేవలం అర్హత ఆధారంగా ఇళ్ల స్థలాలను ఇస్తున్నట్లు చెప్పారు. ఎమ్మెల్యే వెంట మున్సిపల్ ఇంజినీర్ రమణమూర్తి, వైస్ చైర్మన్లు పాంశావలి, గంగిశెట్టి శ్రీధర్, వైఎస్సార్ సీపీ నాయకులు దేశం సుధాకర్‌రెడ్డి ఉన్నారు.

తెలుగుగంగకు సాగు నీరు విడుదల


రుద్రవరం సమీపంలో తెలుగుగంగ ప్రధాన కాల్వలో నీటి ప్రవాహాన్ని పరిశీలిస్తున్న ఈఈ రాజశేఖర్

రుద్రవరం: తెలుగుగంగ ద్వారా అందుబాటులోకి వచ్చిన సాగు నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని ఈఈ రాజశేఖర్ రైతులకు సూచించారు. వార బంది నీటి విడుదలలో భాగంగా ప్రభుత్వం వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి తెలుగుగంగ కాల్వకు గురువారం నీటిని విడుదల చేయడంతో శుక్రవారం నాటికి నీరు రుద్రవరం మండలానికి చేరుకుంది. ప్రధాన కాల్వతో పాటు ఉప ప్రధాన కాల్వలో సాగు నీరు పారడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. అందుబాటులోకి వచ్చిన నీటిని ఆయిల్ ఇంజిన్లు, పైపుల ద్వారా పొలాల్లోని పైర్లకు పారించుకుంటున్నారు. నీటి ప్రవాహన్ని ఈఈ రాజశేఖర్, డీఈఈలు చంద్ర ఓబుల్‌రెడ్డి, రవీంద్ర, జేఈ రామశేషు తదితరులతో కలిసి పరిశీలించారు.18, 19, 20 బ్లాకుల నుంచి దిగువకు ఎంత మోతాదులో నీరు పారుతుందని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఉప ప్రధాన కాల్వల్లో నీరు అధికంగా పారకుండా తగిన మోతాదులో విడుదల చేయించారు. రుద్రవరానికి సమీపాన నల్లమల అటవీ ప్రాంతంలో ఉన్న తుండ్ల(గండ్లేరు)వాగు రిజర్వాయర్ పూర్తిగా నిండాలని, అక్కడి నుంచి ఆళ్లగడ్డ, చాగలమర్రి మండలాల పరిధిలోని కాల్వల ద్వారా రైతులకు సాగు నీరు అందేలా చూడాలని సిబ్బందికి సూచించారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను పరిష్కరించండి


సమావేశానికి హాజరైన అధికారులు, పోలీసులు



మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్

నంద్యాల: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను వేగంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్ట పటిష్ట అమలుపై జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. నందికొట్కూరు ఎమ్మెల్యే తొగుర్ ఆర్థర్, జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి, అడిషనల్ ఎస్పీ వెంకటరాముడు, డీఆర్‌ఓ పుల్లయ్య, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ చింతామణి, జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు చిటికెల సలోమి, జీవన్‌రాజు, రమేష్, దిలీప్‌రాజు, అశోక్ నాయక్, మమత, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీల అట్రాసిటీ కేసులు జాప్యం లేకుండా వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు రెవెన్యూ, పోలీసు అధికారులు సమిష్టిగా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. చార్జ్ షీట్ అయ్యేంత వరకు పరిహారం పెండింగ్ పెట్టకుండా ఏ స్థాయిలో క్లియర్ అయితే ఆ స్థాయిలో పరిహారం చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని డీఆర్‌ఓ పుల్లయ్యకు సూచించారు. ప్రతినెలా 30వ తేదీ పౌర హక్కుల దినోత్సవం అన్ని మండలాల్లో నిర్వహించేందుకు తహసీల్దార్లు చర్యలు తీసుకునేలా ఆదేశాలు జారీ చేయాలన్నారు. నందికొట్కూరు ఎమ్మెల్యే తొగుర్ ఆర్థర్ మాట్లాడుతూ జూపాడుబంగ్లా, పగిడ్యాల మండలాల్లో కమ్యూనిటీ హాళ్ల నిర్మాణాలకు భూములు కేటాయించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

వాల్మీకుల ప్రజా గర్జనను జయప్రదం చేయండి


నాయకులతో మాట్లాడుతున్న పులికొండన్న

నంద్యాల(అర్బన్): చిత్తూరు జిల్లా అంగళ్లలో ఈనెల 8న నిర్వహించే వాల్మీకి ప్రజా గర్జనకు వాల్మీకులు తరలి వచ్చి జయప్రదం చేయాలని ఎంవీఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బోయ పులికొండన్న కోరారు. స్థానిక కార్యాలయంలో శుక్రవారం సమితి ముఖ్య నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాల్మీకులను ఎస్టీలుగా పునరుద్ధరిస్తామంటూ కాంగ్రెస్, టీడీపీలు మోసం చేశాయన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పునరుద్ధరణ అంశాన్ని కేంద్ర ప్రభుత్వానికి పంపిందని, త్వరగా కేంద్రం ఆమోదం పొందేలా చేయాలన్నారు. వాల్మీకుల ప్రధాన సమస్య అయిన ఎస్టీ పునరుద్ధరణ కోసం చేపట్టిన ప్రజా గర్జనను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు నాగేశ్వరరావు, జయరాం, మదనగోపాల్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరిపై కేసు నమోదు

దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూ గోవిందిన్నె గ్రామానికి కిందిన ఓ మహిళపై దాడికి పాల్పడిన ఇద్దరిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ తిరుపాల్ తెలిపిన వివరాలు.. వెంకటలక్ష్మమ్మ అనే మహిళ ఇంటి వద్ద దిష్టి తీసుకుంటుండగా తిరుపతి రమేష్, తిరుపతి శివరామ్‌లు ఆమెతో ఘర్షణకు దిగారు. మాటామాటా పెరగడంతో మహిళపై దాడికి పాల్పడ్డారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

భ్రమరాంబాదేవికి ఊయలసేవ

శ్రీశైలంటెంపుల్: అష్టాదశ శక్తిపీఠంగా వెలసిన శ్రీశైల భ్రమరాంబాదేవికి దేవస్థాన అర్చకులు శాస్త్రోక్తంగా ఊయలసేవ నిర్వహించారు. శుక్రవారం సాయంత్రం 7గంటలకు ప్రారంభమైన సేవలో భాగంగా లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకస్వాములు ముందుగా సేవా సంకల్పాన్ని పఠించారు. కార్యక్రమం నిర్విఘ్నంగా జ రగాలని మహాగణపతిపూజ చేశారు. ఊయలలో స్వామిఅమ్మవార్లను ఆశీనులను చేసి షోడశోపచార పూజలను నిర్వహించిన అనంతరం అమ్మవారికి అష్టోత్తరం, త్రిశతి, ఖడ్గమాల, సహస్రనామ పూజలు జరిపించారు.

పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి


బ్రోచర్‌ను ప్రదర్శిస్తున్న జేసీఎస్ జిల్లా అధ్యక్షుడు షేక్ బాబులాల్

చాగలమర్రి: ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు, జిల్లా జేసీఎస్ కో-ఆర్డినేటర్ షేక్.బాబులాల్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మండల సచివాలయ కన్వీనర్, గ్రామ సచివాలయాల కన్వీనర్లు, గృహ సారథులు, ఎంపీటీసీ సభ్యులు, వార్డు మెంబర్లు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ ప్రభుత్వానికి, జగనన్న ప్రభుత్వానికి తేడాలతో కూడిన ప్రశ్నల బ్రోచర్‌ను ఆవిష్కరించి, అందులోని అంశాలను వివరించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు జి.కుమార్‌రెడ్డి, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు గణేష్‌రెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ వెంకట్రామిరెడ్డి, వైస్ ఎంపీపీ ముల్లా రఫీ, ఎంపీటీసీలు ఫయాజ్, ముల్లా బురాందీన్, వి.మహబూబ్‌షరీఫ్ పాల్గొన్నారు.

గర్భిణులకు సీమంతం


గర్భిణికి సీమంతం చేస్తున్న ఎంపీటీసీ సభ్యురాలు వెంకటలక్ష్మి తదితరులు

చాగలమర్రి: స్థానిక కుమ్మరికట్ట వీధిలోని 6వ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఎంపీటీసీ సభ్యురాలు వై.వెంకటలక్ష్మి హాజరై గర్భిణులకు పసుపు, కుంకుమ, పూలు, పండ్లు, వైఎస్సార్ పౌష్టికాహార కిట్లుతో సారెను అందించారు. అలాగే చిన్నారులకు బాలామృతం, పాలు, గుడ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వార్డు కార్యకర్త లీలావతి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి దిక్సూచి నంద్యాల

- రూ.40 లక్షలతో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు
- ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిశోర్‌రెడ్డి


అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవి

నంద్యాల(సిటీ): అభివృద్ధికి దిక్సూచి నంద్యాల పట్టణమని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిశోర్‌రెడ్డి అన్నారు. పట్టణంలో రూ.40 లక్షలతో సెంట్రల్ లైటింగ్ సిస్టాన్ని శుక్రవారం ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిశోర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంజీవనగర్ నుంచి ఆత్మకూరు బస్టాండ్ వరకు 53 స్తంభాలకు 106 లైట్లతో లైటింగ్ సిస్టం ఉంటుందన్నారు. ఇదివరకే శ్రీనివాసనగర్ నుంచి గాంధీచౌక్ వరకు ఈ సిస్టం అందుబాటులో ఉందన్నారు. రోడ్డు మధ్యలో డివైడర్ ఏర్పాటు చేసి వివిధ రకాల మొక్కలను నాటుతున్నామన్నారు. ప్రతి ప్రాంతంలో ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు ఇదివరకే ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేశామన్నారు. రానున్న రోజుల్లో నంద్యాల పట్టణం అభివృద్ధి చెందిన నగరాల సరసన నిలిపే బాధ్యత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదేనన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ షేక్‌మాబున్నిసా, మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి, ఎంఈ రమణమూర్తి, వైస్‌చైర్మన్లు గంగిశెట్టి శ్రీధర్, పాంశావలి, ఏపీఎస్‌సీడీసీఎల్ డైరెక్టర్ శశికళా రెడ్డి, రాష్ట్ర దృశ్య కళల డైరెక్టర్ సునితఅమృతరాజ్, నంద్యాల రెండవ క్లస్టర్ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు పున్నా శేషయ్య, మున్సిపల్ కౌన్సిలర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

పల్లకీలో విహరించిన మహానందీశ్వర దంపతులు

మహానంది: మహానందీశ్వరస్వామి దంపతులు శుక్రవారం రాత్రి పల్లకీలో విహరించారు. ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు రవిశంకర అవధాని, అర్చకులు స్వామి, అమ్మవారి మూర్తులను విశేషంగా అలంకరించారు. గోమాతను పట్టువస్త్రాలతో అలంకరించి పల్లకీ ముందు ఉంచి ఆలయ ప్రాకారంలో పల్లకోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు.

శ్రీశైలంలో అద్భుత తీర్థాలు

- సామవేదం షణ్ముఖ శర్మ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలంలోని ఆలయ ప్రాంగాణం, ఆలయ పరిసరాల్లో అద్భుతమైన తీర్థాలు ఉన్నాయని, వాటి దివ్యత్వాన్ని పురాణాలు ఎంతగానో వర్ణించాయని ప్రముఖ ప్రవచకులు బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖ శర్మ తెలిపారు. శుక్రవారం ఆలయ దక్షిణ మాఢవీధిలోని నిత్యకళావేదికపై ఆయన శ్రీశైల మహిమా విశేషాలపై ఆరవ రోజు ప్రవచనాలు వినిపించారు. కార్యక్రమంలో దేవస్థాన ఈఓ డి.పెద్దిరాజు, ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.


ప్రవచనాలు వినిపిస్తున్న సామవేదం షణ్ముఖశర్మ